
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 13 మే 2025



పాలిసెట్‌కు సర్వం సిద్ధం



● జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు
● పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
● ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్- 2025 పరీక్షకు సర్వం సిద్ధం చేశారు. పాలిసెట్ పరీక్షలకు నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు జాగ్రత్త వహించాలని ముందస్తుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచిసున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించే పాలిసెట్ పరీక్షకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సోమవారం పాలిసెట్ ప్రత్యేక పరిశీలకుడు రవికుమార్, జిల్లా కోఆర్డినేటర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకరాచారి ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాలిసెట్ నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పాలిసెట్ పరీక్షలకు 2,136 మంది విద్యార్థులు హాజరుకాన్నారు ఇందులో బాలురు 955 మంది, బాలికలు 1,181 మంది ఉన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

పాలిసెట్ పరీక్షకు వచ్చే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అనుమతించరు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను 10 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.

వీటికి అనుమతి

పాలిసెట్ విద్యార్థులు పరీక్షకు హాజరైన సమయంలో కేవలం పెన్సిల్. ఎరైజర్, బాల్‌పెన్, హాల్ టికెట్ మాత్రమే అనుమతిస్తారు సెల్‌ఫోన్లు క్యాలిక్యు లేటర్ ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతిం చరు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి కాగితాలు జిరాక్స్ పేపర్లు తీసుకు వెళ్లవద్దు. పరీక్ష సమయంలో రఫ్ వర్క్ చేసుకోవడానికి ప్రశ్నాపత్రంలోని చివర్లో రెండు తెల్ల కాగితాలు ఉంటాయి.

కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా

పాలిసెట్ పరీక్ష నిర్వహణకు ఏడు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. వేములవాడ మండలంలోని అగ్రహారం వద్ద శ్రీ రాజరాజేశ్వర పాలిటెక్నిక్ కళా శాల, డిగ్రీ కళాశాల, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెహ్రూనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తంగళ్లపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ప్రశాంతంగా పరీక్షలు జరిగే విధంగా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు సవ్యంగా నిర్వహించడానికి రాష్ట్ర పరిశీలకుడితో పాటు జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ , పరీక్ష కేంద్రాల వద్ద పరిశీలకులు. స్క్వాడ్ బృందం ఏర్పాటు చేశారు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఏఎన్ఎంలను అత్యవసర వైద్యశాల కోసం సిద్ధంగా ఉంచారు. ఫస్ట్‌ఎయిడ్ కిట్. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నీటి వృథాను అరికట్టారు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


మరమ్మతు చేసిన గేట్ వాల్వ్

ఎల్లారెడ్డిపేట, మే 12(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో మిషన్ భగీరథ నీటి గేట్ వాల్వ్ చుట్టూ అపరిశుభ్రతతో పాటు నీటి లీకేజీని అధికారులు అరికట్టారు. గేట్ వాల్వ్ చుట్టు నాచు పేరుకుపోయి నీరు వృథాగా పోతుండడంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ' కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం గేట్ వాల్వ్‌ను పరిశీలించారు. గేట్ వాల్వ్ చుట్టూ శుభ్రం చేసి నీటి వృథాను అరికట్టారు. లీకేజీ మరమ్మతు చేయడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇళ్ల యజమానులకు నోటీసులు

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్‌రోడ్డు వెడల్పు చేస్తున్నందున రోడ్డు వెంట ఉన్న ఇళ్ల యజమానులు సెట్ బ్యాక్ కావాలని పంచాయతీ కార్యదర్శి వరుణ్ నోటీసులు జారీ చేశారు. బైపాస్ రోడ్డులో ఇప్పటికే పనులు కొనసాగుతుండగా కొన్ని ఇళ్లు రోడ్డు పక్కనే ఉండటంతో నోటీసులు అందించారు. డివైడర్ నుంచి 25ఫీట్లు వెనుకకు వెళ్లాలని 31మందికి నోటీసులు అందించినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి గరుడ సేవ

గంభీరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో సోమవారం శ్రీ వేణుగోపాల స్వామి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత నూతనపురి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి గరుడ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 6 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం భక్తుల కన్నుల పండువగా సాగింది. సోమవారం స్వామి వారి గరుడ సేవను నిర్వహించారు. స్వామి వారు గరుడ సేవపై నుండి భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు మంగళ హారతులు ఇచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి రథోత్సవం జరగనుంది. రథోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసింది.

ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను అనుమతించాలి

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేందుకు ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వాలని బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి ఒక ప్రకటనలో కోరారు. కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత వల్ల ధాన్యం పేరుకుపోయిందన్నారు. రోహిణి కార్తె మొదలు కాబోతున్నందున రైతులు ఇబ్బంది పడుతున్నందున ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రం


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఇల్లంతకుంట, మే 12(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా నాయకుడు మంద సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని ఒబులాపూర్, వెల్జీపూర్, రహీంఖాన్‌పేట గ్రామాలలో సోమవారం సీపీఐ గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దుచేయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. గ్రామాలలో ఉపాధిహామీ కార్మికులకు 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ వారానికి ఒకసారి చెల్లించాలన్నారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్ మీసం లక్ష్మన్, గ్రామశాఖ కార్యదర్శులు మంద శ్రీనివాస్, కొమురయ్య, శ్రీనివాస్, బ్రహ్మం నాయకులు కనుకయ్య, పోచయ్య, మల్లయ్య, దుర్గమల్లయ్య, రాజేశం, నరేష్, రాజేష్, ప్రవీణ్, మల్లేశం, వీరేశం, పోచమల్లు, లక్ష్మన్, సుధాకర్, రాజు, లక్ష్మన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకోసం ఉద్యమించాలి

● గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్


స్వామిగౌడ్, సత్యనారాయణలను సన్మానిస్తున్న గోపా నాయకులు

ముస్తాబాద్,మే12 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం ఉద్యమించాలని గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కదిరె స్వామిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సత్యనారాయణగౌడ్‌లు నియామకమైన సందర్భంగా వారిని గోపా ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు. హక్కుల సాన కోసం గోపా సంక్షేమ కోసం శ్రమించాలని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపా అధ్యక్షుడు పర్శరాములుగౌడ్, మండల కార్యదర్శి అశోక్‌గౌడ్, బాదవేని అంజాగౌడ్, పదిరే రాజుగౌడ్, నవీన్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ విజయం సాధించాలని పూజలు


వాసుదేవాశ్రమంలో హోమం నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు

ముస్తాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై భారత్ చేస్తున్న దాడి పూర్తి స్థాయిలో విజయవంతం కావాలని మండలంలోని బందనకల్ గ్రామంలో గల వాసుదేవాశ్రమంలో హనుమాన్ మాలధారులు హోమం నిర్వహించారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉగ్రవాదం పూర్తిగా అంతం కావాలని ఆలయ ప్రధాన అర్చకులు రేపాక రామశర్మ రజేందరశర్మ ఆధ్వర్యంలో వాసుదేవాశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. భారతదేశంలో ఇకపై ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా విజయ తీరాలకు చేరాలని పూజలు చేశారు. భారత్ ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుంటే పాకిస్తాన్ మాత్రం దేశంలో పౌరులు, ఆర్మీని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందన్నారు. పాకిస్తాన్ పౌరులకు ఎలాంటి నష్టం జరుగకుండా భారత్ యుద్ధం చేసిందన్నారు. ఉగ్రవాదం పూర్తిగా అంతం కావాలని పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,రాజు, కార్తీక్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన బీఆర్ఎస్

- విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని ప్రజా ప్రభుత్వం అన్ని రకాలుగా సరిదిద్దుతూ గాడిలో పెడుతోందని ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామం నుంచి వివిధ పార్టీల నాయకులు దాదాపు 50 మంది ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేయవేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేద ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో 4,696 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. కొద్దిరోజుల క్రితమే మల్కపేట కుడి కాలువ నుంచి నీటిని దిగువకు విడుదల చేసుకున్నామన్నారు. ఎడమ కాలువ పనులు కూడా పూర్తి చేసుకుని నిమ్మపల్లి వరకు నీటిని ఇచ్చే ప్రక్రియ చేపడతామన్నారు. గతంలో జరగని అభివృద్ధిని ప్రజాప్రభుత్వంలో చేస్తున్నామన్నారు. అభివృద్ధికి ఆటంకాలు సృష్టించొద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. శృంగేరి పీఠాధిపతి అనుమతులతోనే రాజన్న ఆలయ విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. అందరి సలహాలు సూచనలు తీసుకునే ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తాడెం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తి కనుకయ్య, మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాలి సువర్ణ స్వామి, వంకాయల భూమ య్య, బొమ్మ తిరుతపి, బొమ్మ ఎల్లయ్య, ఎంబరి దేవరాజు, లింగంపల్లి సింగరయ్య, వంకాయల మహేశ్వర్, డాక్టర్ రమేష్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మురికి నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోనరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో 'రోడ్డుపై పారుతున్న మురికి నీరు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితం కాగా దానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనిల్ సోమవారం శుభ్రం చేయించారు. మురికి నీరు ప్రధాన రహదారిపైకి రాకుండా చేయడంతో పల్లెవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

రాజన్న భక్తుల మనోభావాలను గౌరవించాలి


● వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి డిమాండ్ ● 14న వేములవాడ బంద్‌కు పిలుపు

వేములవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి పేరిట మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఆలయం మూసివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితిగా ఏర్పడి సోమవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని అభివృద్ధి చేసే క్రమంలో విస్తరించేందుకు తాము సానుకూలంగా ఉన్నామని, అయితే అభివృద్ధి పనులు ఏళ్ల కొద్దీ గడిచే అవకాశం ఉన్నందున ప్రధాన ఆలయంలో శ్రీ స్వామివారి దర్శనం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆలయాన్ని మూసివేయడం సమంజసం కాదని, ఆలయ అభివృద్ధికి సంబంధించిన డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టును బయటకు వెల్లడించకుండానే, అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు భక్తులకు తెలియజేయకుండానే ఆలయాన్ని మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం భక్తుల మనోభావాలను గాయపరచడమేనని అన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్ని నిధులు అవసరం అవుతాయో, ఆ నిధులు ఎక్కడి నుంచి వస్తాయో, అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో ఎలాంటి స్పష్టత లేకుండానే ఏకపక్షంగా ఆలయాన్ని మూసివేయాలని నిర్ణయించడాన్ని రాజన్న భక్తులుగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నిధుల సేకరణలో జాప్యం జరిగితే సంవత్సరాల పాటు ఆలయం మూసి ఉంచుతారా అని ప్రశ్నించారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి విస్తరణ కార్యక్రమాన్ని ఆలయాలు మూసి వేయకుండానే దర్శనాలు కొనసాగిస్తూ పూర్తి చేశారని గుర్తు చేశారు. రాజన్న ఆలయాన్ని మూసివేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బ తినడంతో పాటు ఆలయంపై ఆధారపడి జీవిస్తున్న వందలాది చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ విషయంపై పునరాలోచించి ఆలయాన్ని మూసి వేయాలని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 14వ తేదీన వేములవాడ పట్టణ బందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. బంద్ కార్యక్రమానికి సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా బిజెపి నాయకుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రామతీర్థపు రాజును ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మాజీ కౌన్సిలర్లు నిమశెట్టి విజయ్, నరాల శేఖర్, సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్, నాయకులు రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, కోలా కిష్టస్వామి, నరాల దేవేందర్, గడప కిషోర్‌రావు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు

స్వశక్తి సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదుగాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో ఎనిమిది మహిళా సంఘాలకు కేటాయించిన ఎరువులు, పురుగుల మందుల దుకాణాలకు సంబంధించిన లైసెన్స్‌లను మహిళా సంఘాలకు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదుగాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభిందని అన్నారు. జిల్లాలోని వేములవాడలోని శ్రీధనలక్ష్మీ మండల సమాఖ్య సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్, ముస్తాబాద్‌లో గాయత్రి గ్రామైఖ్య సంఘం, బోయిన్‌పల్లి మండలం విలాసాగర్‌లో గ్రామైఖ్య సంఘం, వేములవాడ శివరామ్ గ్రామైఖ్య సంఘం, కోనరావుపేటలో విశ్వదర్శిని గ్రామైఖ్య సంఘం, గంభీరావుపేటలో విజయలక్ష్మీ గ్రామైఖ్య సంఘం, ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో భాగ్యశ్రీ గ్రామైఖ్యసంఘం, తంగళ్లపల్లి మండల కేంద్రంలో వినాయక ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వారికి విక్రయాల లైసెన్స్‌లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్‌బేగం ఉన్నారు.


మహిళా సంఘాలకు లైసెన్స్‌లు అందజేస్తున్న కలెక్టర్

'లవ్ జిహాద్'ను అడ్డుకునేందుకు చట్టం తీసుకురావాలి

ఎల్లారెడ్డిపేట,మే12(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మత మార్పిడులకు పాల్పడుతున్న సంఘటనలను అడ్డుకునేందుకు ప్రభుత్వం చట్టం తీసుకు రావాలని బీజేపీ నాయకుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇటీవల లవ్ జిహాద్‌లు పెరిగిపోతున్నాయని అన్నారు. హిందూ యువతులు, మహిళలకు మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో నమ్మించి మత మార్పిడిలకు పాల్పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు యువతులు, మహిళల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. మత మార్పిడులకు దిగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మత మార్పిడిలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు.

గ్రీవెన్స్‌డే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం

● ఎస్పీ మహేశ్ బి. గీతె

సిరిసిల్ల క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డే ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ఎస్పీ మహేశ్ బి. గీతె అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించు కుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుం దన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామన్నారు.


ఫిర్యాదుదారుతో మాట్లాడుతూ ఎస్పీ మహేశ్ బి. గీతె

పోలాండ్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి దుర్మరణం


మనోజ్‌గౌడ్(ఫైల్)

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలాండ్ దేశంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాల మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్(29) అనేయువకుడు మృతిచెందాడు. మనోజ్‌గౌడ్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మనోజ్‌గౌడ్ రెండేళ్ల క్రితం ఉపాధి కోసం పోలాండ్ వెళ్లాడు. సోమవారం ఉదయం రహదారి పక్క నుంచి నడుచుకుంటూ పనికి వెళ్తుండగా వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మనోజ్ అక్కడిక్కడే మృతిచెందాడు. మనోజ్ మృతితో కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొంది.

వ్యాపార భాగస్వాముల వేధింపులతో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ, హైదరాబాద్‌లో భూముల కొనుగోలులో పెట్టుబడి పెట్టిన వ్యక్తికి తోటి భాగస్వాములు డబ్బులు చెల్లించకుండా వేధింపులకు గురి చేయడంతో ఆదివారం రాత్రి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా వెల్గటూర్‌మండలం కిషన్‌రావుపేటకు చెందిన మోకినపల్లి శ్రీనివాస్(38) తీగలగుట్టపల్లిలో నివాసం ఉంటూ ఆటో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. యాదగిరి, భూపతి పాపయ్య, రెడ్డి రాజు, నగునూరు గోపితో కలిసి మృతుడు శ్రీనివాస్ ఇసుకక్వారీలో, హైదరాబాద్‌లోని భూముల్లో పెట్టుబడి పెట్టాడు. శ్రీనివాస్ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని చాలా కాలంగా భాగస్వాములను అడుగుతున్నప్పటికీ వారు డబ్బులు ఇవ్వకుండా ఆర్థికంగానూ, మానసికంగానూ వేధింపులకు గురి చేశారు. దీంతో ఆవేదనకు గురైన శ్రీనివాస్ ఆదివారం రాత్రి తీగలగుట్టపల్లిలోని అద్దె ఇంటిలో ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య అంజలి ఫిర్యాదుతో నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు

● పలువురు యజమానులకు జరిమానా

మెట్‌పల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతున్న వారికి1500 రూపాయల జరిమానావిధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ మాట్లాడుతూ జ్యూటుబ్యాగులు మాత్రమేవాడాలని సూచించారు. దుకాణదారులందరూ ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, మున్సిపల్ సిబ్బంది ముజీబ్, పున్నం నాయక్, ప్రశాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పట్టాలెక్కేనా?

● అభివృద్ధికి దూరంగా నాంపల్లి గుట్ట
● రూ. 30 కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితం



వేములవాడ కల్చరల్, మే 12: వేములవాడ మండలంలోని నాంపల్లి గుట్ట ప్రకృతి అందాలకు నిలయం. చుట్టూ పచ్చదనంతో ఎంతగానో ఆకర్షిస్తూ.. గుట్ట మధ్య ఐదు తలల సర్పాకారంలో గుట్టపై నిర్మించిన కాళీయమర్ధనం, తలపై శ్రీకృష్ణుడి నృత్యరూపం, చుట్టూ పచ్చని పంటపొలాలు, ఓ వైపు మూలవాగు అందాలు, మరో వైపు మానేరువాగు అందాలు, ఎదురుగా మధ్యమానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ చూపరులను కట్టిపడేస్తాయి. ఆరువందల సంవత్సరాల క్రితమే నాంపల్లి గుట్టపైన మూడు నామాల రూపంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రతిమ కుడివైపున హనుమంతుడి ప్రతిమ వెలిసినట్లు, చోళుల కాలంలోనే స్వామి వారికి పూజలు జరిగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. మహిమాన్వితంగా వెలుగొందుతున్న లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉన్న నాంపల్లి గుట్ట పర్యాటకంగా అభివృద్ధి దూరంగా ఉన్నది. 2015వ సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన సందర్భంగా నాంపల్లి గుట్టను సందర్శించారు. గుట్టను పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లోనే రూ. 28 నుంచి రూ. 30 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధ చేసి చిత్రాలను సైతం విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాంపల్లి గుట్ట పర్యాటకాభివృద్ధికి నోచుకోలేదు.

● కట్టిపడేసే కాళీయమర్ధనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003 సంవత్సరంలో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్రసహాయ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు తలల సర్పాకారంలో వున్న కాళీయమర్ధనాన్ని నిర్మించారు. సుమారు సంవత్సరం పాటు కాళీయ మర్ధనం నిర్మాణ పనులు చేపట్టారు. పాముపైన శ్రీకృష్ణుడు నృత్యం చేస్తున్నట్లు వెనుకభాగంలో పచ్చటి పంటపొలాలతో ఎంతో ఆకర్షనీయంగా చూపరులను కట్టిపడేస్తుంది. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రన్రసింహస్వామి విగ్రహంతో పాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు.

● నిరాదరణకు గురువుతన్న గుహలు, శిలలు

నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్లలో వున్న ధర్మగుండం సుమారు వెయ్యి యేళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టతో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజసిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతో పాటు పలు విగ్రహాలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నాయి. క్రీ.శ 10వ శతాబ్ధంలో నవనాథ సిద్ధులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ది పొందారని, ప్రతినిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని చేరుకుని పూజలు చేసేవారని నానుడి. అలాంటి గుహలు నిరాదరణకు గురవుతున్నాయి. అంతే కాకుండా నాంపల్లి గుట్ట చుట్టూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి అందులో 12వ శతాబ్దం సంబంధించిన జైన మతానికి చెందిన పార్శనాథుని ప్రతిమ బండరాయికి కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాకుండా గుట్టకు నాలుగు వైపులా పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.


నాంపల్లి గుట్టపై రోప్ వే ఊహా చిత్రం

● ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి గుట్ట అభివృద్ధి జరుగుతుందని జోరుగా ప్రచారం జరిగింది నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉండ టంతో గుట్టపైన కొలువుదీరిన స్వామి వారిని వృద్దులు, వికలాంగులు దర్శించుకునేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో నాంపల్లి గుట్టపైకి వెళ్లేందకు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపట్టాలని, నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు ఒక్కటే ఘాట్ రోడ్డు ఉండటంతో ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు నిర్మాణం, గుట్టపైన ఉన్న రెండు ధర్మగుండాలను ఆహ్లాదకరంగా సుందరీకరణకు, గుట్టపైకి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ఆహ్లాదకరమైన వాతావరణంలో ధ్యానమందిరం నిర్మాణం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ వున్న ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహాచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో మందడుగు పడటంతో భక్తులు నాంపల్లి గుట్ట కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతున్నారు.

గోనె సంచులు ఇవ్వడంలో నిర్లక్ష్యం

● పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్ని సంచులు ఇవ్వకపోవడంపై చొప్పరి కనుకయ్య అనే రైతు ఆదివారం సాయంత్రం పురుగుల మందుతో ఆత్మహత్యయత్నానికి పాల్పడేందుకు యత్నించాడు. కనుకయ్య 25రోజుల క్రితం కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోశాడు. పలుమార్లు అడిగినా గన్ని సంచులు ఇవ్వలేదు. పది రోజుల క్రితం కేంద్రంలో పోసిన ధాన్యానికి గన్ని సంచులు ఇవ్వడంతో కనుకయ్య నిర్వాహకులను నిలదీశారు. కొనుగోలు కేంద్రంలో క్రమపద్ధతి పాటించడం లేదని, అందరిని సమానంగా చూస్తూ కొనుగోలు చేయాలని సూచించినా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఓ వైపు వర్షాలు, మరోపక్క ఎండతీవ్రత, కేంద్రం నిర్వాహకుల వైఖరిని నిరసిస్తూ కనుకయ్య ఆవేదనకు గురై పురుగుల మందు తాగేందుకు సిద్ధపడగా అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. ఇంత జరిగినా నిర్వాహకులు గన్ని సంచులు ఇవ్వలేదని రైతు చొప్పరి కనుకయ్య పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు

● పది నిమిషాల్లో డాక్యుమెంట్ అందజేత
● ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్


డాక్యుమెంటు అందజేస్తున్న రిజిస్ట్రార్

పెద్దపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత కేటాయించిన తేదీలో కార్యాలయానికి వస్తే కేవలం పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తోపాటు మ్యూటేషన్ అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లారిజిస్ట్రార్ బీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌సేవలు పైలట్‌ప్రాజెక్టు కింద ఎంపికైంది. సోమవారం ఆన్‌లైన్‌సేవలు ప్రారంభించిన అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడుతలో పైలెట్ ప్రాజెక్టు కింద 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపికయ్యాయని అందులో జగిత్యాల, రామగుండం ఉన్నాయని, రెండోవిడుతలో పెద్దపల్లి ఉందన్నారు. జూన్2న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. గతంలో స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు సుమారు వారంరోజులు సమయం పట్టేదన్నారు. ప్రస్తుతం పదినిమిషాల్లో ఇస్తామన్నారు. ఈ విధానం ద్వారా రోజుకు 48రిజిస్ట్రేషన్లు చేయ వచ్చన్నారు. దీంతో కార్యాలయం చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, అలాగే ఎక్కువ సమయం నిరీక్షించవల్సిన పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభించగానే ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం ఈశ్వరమ్మకు డాక్యుమెంట్‌ను అందజేశారు. అశోక్, పారుపెల్లి వేణు తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం

వీణవంక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడకులస్థులు రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం చేశారు. నీటిబిందెలను నెత్తినపెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడసంఘం మహిళలు ప్రతిఇంటి నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా కదిలారు. గీతకార్మికులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.


వల్భాపూర్‌లో బిందెలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

చొప్పదండిలో హార్వెస్టర్ దగ్ధం

చొప్పదండి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. హార్వెస్టర్‌కు మంటలు అంటుకోగా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


తిరుపతి రావు(ఫైల్)

తిమ్మాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా తట్టుకోలేని తండ్రి ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతి రావు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని కుమారుడు సిరికొండ నిఖిల్‌రావు(22) హైదరాబాద్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. అందులో డబ్బులు పోగొట్టుకొని మనస్తాపానికి గురై గత మార్చి10న గ్రామశివారులోని వారి వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతిరావు కుమారుడు లేని లోటు జీర్ణించుకోలేకపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావివద్ద (కుమారుడు పడిన బావి) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తిరుపతిరావు తన భార్య శ్యామలకు ఫోన్‌చేసి తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు తెలుపగా వారు తిరుపతిరావును కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతిరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైనచికిత్స కోసం హైదారాబాద్ తరలించారు. హైదారాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తిరుపతిరావు మృతిచెందాడు. రెండునెలల్లో కుమారుడు, తండ్రి మృతిచెంద డంతో తిరుపతిరావు భార్య శ్యామల ఒంటరైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

అంతర్గాం, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కమాన్‌పూర్, భూపాలపల్లి ఏరియాకు చెందిన సాయి ప్రదీప్, యశ్వంత్, శివ, కమల్‌లు ఒడిశా రాష్ట్రం నుంచి రెండు బైక్‌లపై 15కిలోలు సుమారు రూ.8లక్షల విలువ గల గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటస్వామి బుగ్గగుట్ట వద్ద వలపన్ని పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న బ్యాగుల తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. గంజాయితో పట్టుబడిన నిందితులను గోదావరిఖని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐతోపాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ అక్కపాక రవీందర్, మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని కొండారెడ్డిపల్లెకు చెందిన మాచనూరు కొండయ్య(22) జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్‌ఎస్సై మల్లేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలునిర్వహిస్తున్న సమయంలో పట్టుబడగా, కేసునమోదుచేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి కరుణాకర్ కొండయ్యకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురికి రెండేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన కేసులో సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన ఎర్ర మల్లేశం, ఎర్ర రాజవ్వ, ఎర్ర సుజాత, ఎడవల్లి మల్లవ్వ, జింక దేవవ్వలకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన అరుణ తన ఇంటి వద్ద లేనిది చూసి ఇంటి వెనుక ప్రహరీ గోడను ఎర్ర మల్లేశం, రాజవ్వ, సుజాత, మల్లవ్వ, దేవవ్వలు కలిసి కూలగొట్టారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న పోచవ్వ వెళ్లి అరుణకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన ఐదుగురు వ్యక్తులు కలిసి తిట్టుకుంటూ గడ్డపారతో పొడిచి గాయపరిచేందుకు ప్రయత్నించారు. ఈ దాడిని చూసిన నర్మెట్ట రమేశ్, రగుడు లక్ష్మన్ వెళ్లి పోచవ్వ, అరుణలను కాపాడారు. అయినప్పటికీ మిమ్మల్ని ఎప్పటికైనా చంపుతామని ఐదుగురు వ్యక్తులు బెదిరించారని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు అరుణ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం చార్జీషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ 11మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 6వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి


కొలనూర్‌లో నాటుసారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓదెల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి నాటుసారా తయారీకేంద్రాలపై పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నాటుసారా తయారు చేసి విక్రయానికి పాల్పడుతున్న గండికోట కనుకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది రాజు, రాజేందర్, అశోక్ పాల్గొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వెంకటయ్యపల్లి గ్రామ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మూడుట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం దాడిచేయగా డ్రైవర్‌బెజ్జంకి తిరుపతి పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం సమ్మెహక్కు, ఉద్యోగ, సామాజిక భద్రత కాలరాయడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీ కరణ విధానాలు అమలు చేస్తోందన్నారు. మే20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు మొదలు పెట్టాలన్నారు. లేబర్‌కోడ్స్ రద్దుకోసం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, రైతులను, కూలీలను కలుపుకొని పెద్దఎత్తున సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు పద్మ, లక్ష్మి, రజిత, పరిమిత, సత్యలక్ష్మి, ప్రియాంక, సరిత, లత పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి


రాజన్న ఆలయ గోశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఎండల నేపథ్యంలో రాజన్న ఆలయ కోడెల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవులకు అందిస్తున్న మేత, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, సౌకర్యాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వాటి సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ కోడెలకు వేసిన జియో ట్యాగులను పరిశీలించారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్‌తో కూడిన పరికరాన్ని పెట్టాల న్నారు. తద్వారా కోడెల పంపిణీ అనంతరం వాటియొక్క లోకేషన్ ట్రాకింగ్ చేయవచ్చన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గోశాల షెడ్లలో నీటి తుంపర్ల యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. షెడ్లలో నిలువ చేసిన గడ్డిని తరలించి కోడెలకు మేతకు ఉపయోగించాలన్నారు. కోడెలకు సరిపడా పచ్చిగడ్డి అందుబాటులో ఉంచాలన్నారు.

ఎండాకాలం నేపథ్యంలో గోవుల సంరక్ష ణను మరింత బాధ్యతగా చూసుకోవాలని గోశాల సిబ్బందికి సూచించారు. కోడెలకు నిత్యం అందించే దాణా, మేత, తాగునీరు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కోడెల వైద్యం టీకాలు, ఇతర అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కోడెల వయసు ఆధారంగా వాటిని వివిధ షెడ్‌లలో పెట్టాలన్నారు. అనంతరం పశువైద్యాధి కారులు గోవులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఆలయ ఏఈవో శ్రీనివాస్, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

24 నుంచి 'తానాకాన్' రాష్ట్ర సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తానాకాన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ శ్రీనివాస్

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో తానాకాన్ పేరిట రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ బండారి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్న సదస్సులో 24న సీఎంఈ(కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న చిన్న, మధ్యతరహా హస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్ ఎదుర్కొంటున్న సమస్యలైన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, హాస్పిటల్స్ పర్మిషన్(న్యూ, రినివల్స్), పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, ట్రేడ్ లైసెన్స్ ఎస్‌టీపీ, ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లపై దాడులు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి పైగా వైద్యులు హాజరతారని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ మహేశ్, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయం


వడుకాపూర్ గ్రామశివారులో బుద్ధుడికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

జూలపల్లి/ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. వడుకాపూర్ గ్రామపరిధిలోగల అతిప్రాచీన బౌద్ధస్తూపం వద్ద సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని జూలపల్లి, ఎలిగేడు మండలాల దళిత సంఘాల నాయకులు, బౌద్ధిస్టులు గౌతమ బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు బుద్ధుడివిగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మానవజాతికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు అందరికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పంచశీల జెండాను ఆవిష్కరించారు. బుద్ధ క్షేత్రానికి రావడానికి రహదారి సరిగా లేదని, తారురోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేహదానం అవయవదాన పత్రాన్ని అందించారు. ఎస్ఐ సనత్‌కుమార్, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య కాంబ్లే, దేవ శ్రీనివాస్, పర్శరాములుగౌడ్, మొగురం రమేష్, పాటకుల భూమయ్య, పలువురు నాయకులు బౌద్ధిస్టులు, పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఎంఏ (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, ఎకనామిక్స్ సోషియాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణాంకాలు, మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్, కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్, ఎంకామ్ (జనరల్, ఎఫ్ఏ, సీఏపీ, ఇన్సూరెన్స్), ఎంబీఏ. 1,3వసెమిస్టర్ జనవరి/ఫిబ్రవరి 2025పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిడాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ww.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని, వెబ్ సైట్‌లో హాల్‌టికెట్స్ పొందుపరిచామని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు జారీ చేయాలని సూచించారు. పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని తెలిపారు.


కాళేశ్వరం గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఆకృతి

చల్లగ చూడు సరస్వతీ మాత

15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు...
- రేపు రాత్రి 10-35 గంటలకు పుష్కర ముహూర్తం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశం ఎన్నో పుణ్య నదులున్నాయి. గురువు ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. పుష్కరం అంటే జలమని పేరు. మామూలు నదీ స్నానం కంటే పుష్కర స్నానం అనేక రెట్ల పుణ్య ఫలాన్ని, సకల శుభాలను, మోక్షాన్ని ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సరస్వతీ నది ప్రస్తావన ఋగ్వేదంలో ఉంది. ఈ నది ఎవరికీ కనపడదు. హిమాలయాలలోని శివాలిక్ పర్వత పంక్తుల్లోని ప్లక్షప్రస్రవణగిరిపై పుట్టింది. సరస్వతీ నదీ ప్రస్తావన పద్మ, బ్రహ్మవైవర్త పురాణాల్లోనూ ఉంది. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు రానున్న సందర్భంలో 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఇదే పుష్కర సమయ ముహూర్తం...

ఈ నెల 14వ తేదీ రాత్రి 10-35 గంటలకు బృహస్పతి మిథున రాశిలో ప్రవేశించడంతో సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు కాళేశ్వర ఆలయం అర్చకులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

● సరస్వతీ నది ఎక్కడెక్కడ ఉంది?

తొలుత భూమిపై ఉత్తరాఖండ్, చమేలీ జిల్లా బదరీనాథ్ సమీపంలో మానా గ్రామంలో మాత్రమే సరస్వతీ నది కనిపిస్తోంది. ఇదే మొదటి నది. ఈ నదిని అక్కడ ప్రత్యక్షంగా చూడవచ్చు. పాండవులు స్వర్గారోహణం చేసే ముందు మానా గ్రామానికి వచ్చినప్పుడు ఈ నదిని దాటాల్సి వచ్చింది. అప్పుడు భీముడు రెండు కొండల మీద మరో కొండ నిలిపి వంతెనలా ఏర్పాటు చేశాడు. అందుకే దాన్ని భీమ్‌పూర్, భీమ్ వారధి అంటారు. ఇక రెండోది పంచ సరోవరాల్లో ఒకటైన పుష్కర్ సరోవరంలో కనిపిస్తుంది. ఇది రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఆరావళి కొండల మధ్యఉంది. అజ్మీర్‌కు 14 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మదేవుడి ఆలయం కూడా ఉంది. పద్మపురాణం ప్రకారం వజ్రనాభుడు అనే రాక్షసున్ని బ్రహ్మ తన చేతిలోని తామర పువ్వు విసిరి సంహరిస్తాడు. ఆ పువ్వులోని 3 రేకులు భూమిపై పడి జేష్ఠ, మధ్య, కనిష్ఠ పుష్కర సరస్సులుగా మారి సరస్వతీ నది ద్వారానే ఏర్పడినాయని తెలుస్తోంది. మూడోది గంగా, యమునా నదులతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహించే ప్రయాగరాజ్ క్షేత్రం. ప్రయాగకు అమృత తీర్థమని, భాస్కర తీర్థమనే పేర్లు వచ్చాయి. నాలుగోది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధాపూర్‌లో ఉన్నది. ఐదోది తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితలతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల పుష్కరిణిలో కూడా సరస్వతి అంతర్లీనంగా ఉందని చెబుతారు. ఇది ఆరోది. ఈ ప్రదేశాల్లో పుష్కర రోజుల్లో స్నానం చేయవచ్చు.

● హెలీకాప్టర్‌తో జాయ్‌రైడ్

పుష్కరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హెలీకాప్టర్ ద్వారా పుష్కరాలను వీక్షించేందుకు జాయ్ రైడ్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. ఒక్కరికి 4,500 టికెట్ చొప్పున తీసుకొని 6 నుంచి 7 నిముషాల పాటు హెలీకాప్టర్‌లో పుష్కరాలను, కాళేశ్వర అడవుల అందాలను వీక్షించవచ్చు. టికెట్ల బుకింగ్ కోసం టోల్‌ఫ్రీ నంబరును త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిసింది.

● పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు...


కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లు

కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దేవాదాయశాఖ అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళికను రూపొందిచారు. ప్రభుత్వం 35 కోట్లు విడుదల చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు, 12 రోజుల పాటు నదీ హారతి ఉంటుందని మంత్రులు తెలిపారు. పుష్కరాలకు ప్రతీ రోజూ లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పుష్కర ఘాట్‌లు, మంచినీటికి, వసతికి, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు చెప్పారు.

● పుష్కర స్నానం ఎలా చేయాలి?

స్నానానికి ముందు సరస్వతీ నదిని అర్చించి, స్నానం చేయాలి. దంపతులు కొంగులు ముడి వేసుకొని మూడు సార్లు మునిగి సరిగంగ స్నానం చేయాలి. నదీ స్నానం ఎక్కడ, ఎప్పుడు చేసినా ముందు పిడికెడు మట్టిని ఒడ్డు నుంచి తీసుకొని కృత్య అనే శక్తిని స్మరించి నదిలో వేయాలి. ఆ పై సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. 12 రోజులు 12 రకాల దానాలు ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ధర్నా

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): దళితబంధు నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి గ్రౌండింగ్ చేయాలని కోరుతూ దళితబంధు లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరా బాద్ నియోజకవర్గానికి చెందిన 60మందికిపైగా రెండోవిడత లబ్ధిదారులకు సంబంధించిన ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దళితుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాతాలో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ సీఎండీ జనవరి 28న నిధులు విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల జిరాక్స్‌లను చూపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండవ విడత దళితబంధు లబ్ధిదారులు

పౌర రక్షణ వలంటీర్ల నమోదుకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మై భారత్ యువతను పౌరరక్షణ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు మైభారత్ నెహ్రూ యువ కేంద్ర, జిల్లాయువజన అధికారి వెంకట రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ దేశవ్యాప్తంగా యువతను భారత్‌పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. దేశానికి సేవ చేయాలనుకునే ఇందులో చేరడానికి ఆహ్వానం పలుకుతున్న పేర్కొన్నారు. వివరాలకు https://mybharat.gov.in, మై భారత్ నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ జిల్లా, నంబర్లలో 9177329258, 0878-2243604 సంప్రదించాలని సూచించారు.

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ


కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహరాజ్ ఆధ్వర్యంలో 28వ సారి నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సుమారు ఆరు కి.మీల మేర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంబించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

19 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షల ప్రణాళిక విడుదల చేశారు. ఈ నెల 19నుంచి 30వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 2019 బ్యాచ్ బ్యాక్లాగ్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించినట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ పార్సిల్స్ వేలం

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ లాజిస్టిక్స్ కౌంటర్‌లో 40 రోజుల పైబడిన పార్శిళ్లను వేలం వేయనున్నట్లు కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటలకు కరీంనగర్ బస్టాండ్ కౌంటర్‌లో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో ప్రశాంతంగా ఈసెట్


పరీక్ష హాల్‌లోకి వెళుతున్న అభ్యర్థులు

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈసెట్ పరీక్షలు సోమవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మామిడికాయ పచ్చడి సందడి


మామిడికాయలను ముక్కలుగా కొడుతున్న మహిళ

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మామిడికాయ పచ్చడి సందడి నెలకొంది. పచ్చడికి అనువైన మాసాలు ఏప్రిల్, మే కాగా మే నెలలో తయారీకి ప్రాధాన్యమిస్తారు. కాయల నాణ్యత, పచ్చడి పెట్టే విధానాన్ని బట్టి రెండు సంవత్సరాల వరకూ నిలువ ఉంటుంది. అందుకే మామిడి పచ్చడిని ఏడాది గ్రాసంగా అభివర్ణిస్తారు. వేడి అన్నంలో పచ్చడి, నూనె లేదా నెయ్యి కలుపుకొని తింటే స్వర్గం కనిపిస్తోందని పచ్చడి ప్రియులు పేర్కొంటారు. గాలి వానలకు కాయలు రాలక ముందే కాయలు, వస్తువులు కొనుగోలు చేస్తూ పచ్చడి తయారీలో నిమగ్నమవుతున్నారు.


మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

● చుక్కలను చూపుతున్న ధరలు

● మామిడికాయల ధరలు...

మార్కెట్‌లో కాయలు రైతులు రాసులుగా పోశారు. పుల్లటి కాయకు గిరాకీ ఉండగా ఒక్కో కాయ సైజును బట్టి 6 నుంచి 15 రూపాయల వరకు అమ్ముతున్నారు. కాయ ఎంపికలో జాగ్రత్తపడక పోతే తొక్కు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. గ్రామాల నుంచి మార్కెట్‌కు వచ్చిన పలువురు కాయలను కొడుతూ ఉపాధి పొందుతున్నారు. నీళ్లలో వేసి తుడిచి కొట్టేందుకు కాయకు ఐదు నుంచి ఎనిమిది రూపాయల వరకు తీసుకుంటున్నారు.

● ముడి వస్తువుల ధరలు

పచ్చడికి అవసరమైన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 160, పల్లి నూనె ప్యాకెట్ 150, ఆవాలు, మెంతులు కిలోకి100, జీలకర్ర కిలో 300, శనగలు కిలో 80, ఉప్పు కిలో 20, కారం 250, ఇంగువ 50 రూపాయల వరకు పలుకుతున్నాయి.

● పచ్చడి తయారీ ఇలా...

బాణలో నూనెపోసి ఆవాలు, జీలకర్ర, మెంతులు (అలవాట్లను బట్టి అల్లం వెల్లుల్లి)వేసి పోపు పెట్టాలి. తగినంతగా కారం, ఉప్పు వేసి చల్లార్చుకోవాలి. తర్వాత మామిడి ముక్కలను కలపాలి. పోపులో ఇంగువను వాడవచ్చు. పల్లీలు, జీడిని కూడా వేస్తారు. ఉప్పు ఆవకాయ పెట్టేవారు ఆవపొడి, పసుపు, ఉప్పు వేసి కలిపి పెట్టి ఒక రోజు తర్వాత పోపు పెట్టాలి. ముక్కలతో పాటు పోపు పెట్టిన కారాన్ని కల్పి జాడీలలోకి ఎత్తుకుంటే రెండు రోజుల తర్వాత ఊరుతుంది. పచ్చడి ఎంత ఊరితే అంత రుచి వస్తోంది.



గంభీరావుపేటలో వర్షం

● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



గంభీరావుపేట కొనుగోలు కేంద్రంలో నిలిచిన వాన నీరు

గంభీరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు నర్మాల, దేశాయిపేట, ముస్తాఫనగర్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురవడంతో రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లు తడిసిపోయాయి. ఉరుములతో కూడిన వర్షం రావడంతో కొనుగోలు కేంద్రాల్లో వరద నీరు నిలిచింది. ధాన్యం కుప్పల్లోకి వర్షపు నీరు పోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల పొలాల వద్ద ఉన్న వరి ధాన్యం తడిసింది. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సేవలు ఆదర్శం



ప్రేరణ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కెకె మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పుష్కరకాలంగా ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సేవలు ఆదర్శమని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడెం గ్రామంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు 40 మందికి పైగా ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అలాగే దాదాపు వంద మంది విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లను అందించారన్నారు. సామాజిక సేవలతో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ యువతకు ఆదర్శంగా నిలుస్తోందని కేకే మహేందర్‌రెడ్డి కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సింలు , బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, మాజీ ఎఎంసీ ఛైర్మన్ అంజనేయరావు, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సడిమెల బాలయ్య, చిట్నేని శ్రీనివాస్‌రావు, ఎల్లాగౌడ్, కొండం రాజిరెడ్డి,రాగం కుమార్, బొప్ప నర్సయ్య పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట,మే12(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం పుట్టకు ధ్వని పోయుట, పుట్ట బంగారం తెచ్చుట తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు పోచమ్మ, ఎల్లమ్మ బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాలగౌడ్, విఠల్‌గౌడ్, సత్యాగౌడ్, భూమాగౌడ్, నారాయణగౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూఐ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయంలో ఎదుట పారిశుధ్య కార్మికులతో కలసి మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు, కార్మికులు ఆవిష్కరించారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, కార్యదర్శి కాసారపు శంకర్, నాయకులు ఏల్లుల బాలయ్య, దేవరాజు, మల్లేశం, రాజయ్య, నరేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట : మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, కనగర్తి గ్రామాల్లో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్మికుల సమ్మె పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎరవెల్లి అశోక్, సురేష్, కాదాసు సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు

చందుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో గల చారువాక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుద్ధ పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల ఎల్లయ్య, డప్పుల అశోక్, ఇస్మాయిల్, చార్వాక ట్రస్ట్ వృద్ధులు ఉన్నారు.

పలువురిని పరామర్శించిన ప్రభుత్వ విప్

చందుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మ్యాదరి మనోహర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, పల్లి శంకర్ గత కొన్ని రోజులుగా వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్నది. వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మేకల గణేష్, నాయకులు నాగం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు పరామర్శ

చందుర్తి (రుద్రంగి), మే 12 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డికి వారం రోజుల క్రితం మెడ భాగంలో న్యూరో సర్జన్ ఆపరేషన్ జరిగింది. రవీందర్ రెడ్డిని సోమవారం రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు తూము జలపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె మనోహర్, అభిలాష్, గంగాధర్, వంశీ, గురుదాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుడు మృతి

చందుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది (మల్టీ పర్పస్ వర్కర్)ఎర్రం మురళి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ నుంచి 10 వేల రూపాయలు నగదును దహన సంస్కార ఖర్చులకు ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

● కిటకిటలాడిన కలెక్టరేట్ ● ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్



కలెక్టరేట్‌కు వచ్చిన చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో విన్నపాల వెల్లువ.. ప్రజల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం మండుటెండలో సైతం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు ప్రజలు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంల్లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్ధాపూర్ గ్రామానికి చెందిన తీగల అమృతవ్వ- ఎల్లయ్య దంపతులు కూలీ పనులుచేసుకుంటూ జీవిస్తున్నారు. వారి కొడుకు కోడలు మరణించడంతో వారి కుమారుడైన తీగల విష్ణును పోషించుకుంటున్నారు. ఎల్లయ్య చనిపోవడంతో విష్ణు తనను పోషిస్తామని చెప్పి నా భర్త పేరున ఉన్న ఇళ్లను తనపేరు రిజిస్ట్రేషన్ చేసుకుని పోషించుకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అమృతవ్వ కలెక్టర్‌కు విన్నవించింది.కలెక్టర్ స్పందించి నాకు న్యాయం చేయాలంటూ సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించి వేడుకున్నది.

జనన సర్టిఫికెట్‌ను ఇప్పించండి

- బండి అప్పారావు, తిప్పాపూర్



వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం, నా భార్యకు 2012 సంవత్సరంలో సిరిసిల్ల సివిల్ ఆసుపత్రిలో డెలివరీ కావడంతో బాబు జన్మించాడు, నాబాబుకు బర్త్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరు గుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి మా కుమారుడికి బర్త్ సర్టిఫికెట్ ఇప్పించి ఆదుకోవాలి.

నడువలేకుండా ఉన్నా సాయం చేయండి

- ఒగ్గు రజిత, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నేను పుట్టుకతోనే దివ్యాంగురాలిని. నాకు ఒక కాలు సక్రమంగా లేకపోవడంతో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాను. నా పనులతోపాటు నా కుటుంబాన్ని పోషించు కోవడానికి ఉపాధి కూరగాయల వ్యాపారం చేసుకునేందుకు నాకు మూడు చక్రాల స్కూటీ ఇప్పిస్తే దానిపై వ్యాపారం చేసుకుంటూ నా కుటుంబాన్ని పోషించుకుంటాను. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

- ఉప్పుల లక్ష్మి, హరిదాస్‌నగర్



ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో సర్వేనంబర్ 44డిలో ఉన్న 26 గుంటలు, 44/డీఏ లోని 150 గుంట భూములను నాకు తెలియకుండా నా చిన్నకుమారుడు ఉప్పుల రవి, అతని కుమారుడు ఉప్పుల నవీన్ పేరున దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి న్యాయం చేయాలి.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇంటికే పరిమితం

- అర్ శివకృష్ణ, చందుర్తి



చందుర్తి మండల కేంద్రానికి చెందిన నేను 2022 సంవత్సరంలో చందుర్తి బస్టాండ్ ప్రాంతంలో నిలబడి ఉండగా ఆర్టీసీ బస్సు రాంగ్ రూట్ వచ్చి నన్ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలకు గురయ్యాను. గత మూడు సంవత్సరాల నుంచి ఇంటికే పరిమితమయ్యాను. పీజీ వరకు చదు వుకున్న నాకు బయటకు వెళ్లేందుకు ఎలాంటి వాహనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. జిల్లా కలెక్టర్ స్పందించి నాకు స్కూటీని ఇప్పిస్తే ఉపాధి పనులు చేసుకునేందుకు వీలుగా ఉంటుంది.

గోరక్ష చట్టాలను అముల చేయాలి

దేశీ గోవంశరక్షణ సంవర్ధన సమితి నాయకులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గోరక్ష చట్టాలను జిల్లా కలెక్టర్ అమలుచేసి గోవులను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు రాధాక్రిష్ణరెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి జిల్లాలో గోరక్ష చట్టాలను అమలు చేసి గోవులను రక్షించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణం మూసివేయించడంతోపాటు వేములవాడ దేవస్థానంలో ఉన్న గోశాలలో ఉన్న గోవుల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, విశ్వహిందూ పరిషత్ గోరక్ష జిల్లా ఇన్‌చార్జి సంతోష్ పాల్గొన్నారు.

చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అక్రమంగా అమ్ముకున్న ఇళ్ల స్థలాలపై విచారణ జరుపాలి

వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్ ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న విలువైన ఇళ్ల స్థలాలను గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు అక్రమంగా అమ్ముకున్నారని దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని కాలనీవాసులు వంగ పర్శరాం, దేవరాజు, శ్రీనివాస్, సతీష్ తదితరులు తరలివచ్చి కలెక్టర్‌కు విన్నవించారు.



దేశీ గోవంశరక్షణ సంవర్ధన సమితి నాయకులు

ఘనంగా వేణుగోపాల స్వామి రథయాత్ర

కోనరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో సోమవారం శ్రీ వేణుగోపాల స్వామిని రథంపై ఊరేగించారు. ప్రతి సంవత్సరం పౌర్ణమి సందర్భంగా స్వామి వారిని రథంపై ఊరేగిస్తారు. ఇందులో భాగంగా స్వామివారిని రథంపై ఊరేగించగా భక్తులు మంగళహారతులతో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి నియామకంపై సంబరాలు

చందుర్తి(రుద్రంగి), మే 12 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా కర్ణవత్తుల వేణును నియమిస్తూ పార్టీ నియామక పత్రాన్ని జారీ చేసిన సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేణును సన్మానించి, కేక్ కట్ స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేణు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇంచార్జ్ వికాస్‌రావుకి, జిల్లా అధ్యక్షుడు గోపికి, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకి, అల్లాడి రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి

● ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ వినతి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అలయ పరిసరాలలో నూతన సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేస్తే వేములవాడ పట్టణ పరిధిలోని రైతులకు, పట్టణ ప్రజలకు, శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయంలో భక్తుల రద్దీ ఎక్కువ అవుతున్న నేపథ్యంలో, వసతి గదులకు, రాజన్న ఆలయంలో నిర్వహించే వివిధ వేడుకల వల్ల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా, పట్టణంలో లోఓల్టేజ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు వీలుగా ఉంటుందని ఉపముఖ్యమంత్రికి విన్నవించారు. ఇటీవల వేములవాడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌లను మంజూరు చేసినందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. నూతన సబ్ స్టేషన్‌ల శంకుస్థాపనకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రావాలని ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్ల ద్వారా వెళ్లి తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

స్వామి వారి సేవలో శాసనమండలి డిప్యూటీ చైర్మెన్

శాసమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండ ప్రకాశ్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వేదోక్త మంత్ర ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆయనకు శేషవస్త్రం కప్పి స్వామి వారి ప్రసాదం అందజేశారు.



బండ ప్రకాశ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈవో

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

చందురి, మే 12 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. రాజు అనే రైతు ఎల్లంపల్లి కాలువ భూమిని, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడన్న సమాచారం మేరకు పనులను ఆర్ఐ మహేందర్ పరిశీలించి, సర్వే చేసేంత వరకు పనులు నిలిపి వేయాలని సంబంధిత రైతుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతే కాకుండా నెల రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులపై బోరు వేయించి పైపులు పగిలేందుకు బాధ్యుడైనా చర్యలు తీసుకోకపోవడంతోనే తిరిగి ప్రభుత్వ భూమిని చదును చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలంటున్నారు.

మట్టి పోసి ఏడాది.. నిర్మాణం జాడేది

● ముందుకు సాగని రాగట్లపల్లి- దుమాల రోడ్డు నిర్మాణ పనులు



రహదారి పక్కన పోసిన మట్టి కుప్పలు

ఎల్లారెడ్డిపేట, మే12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రహదారులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా నిర్మాణ పనులను చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్ల పల్లె ప్రజలకు రవాణా కష్టాలు తీరడం లేదు. నిధులు మంజూరైన నిర్మాణ పనుల జాడ లేక గ్రామీణవాసులకు మట్టి రోడ్డే దిక్కవుతోంది. వానలు పడక ముందే పనులను పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. యేడాది కిందట పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్, అధికారులు కనీసం అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రయాణ తిప్పలు తప్పడం లేవని ప్రజలు వాపోతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి- దుమాల- అక్కపల్లి మీదుగా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామాలను కలుపుతూ రోడ్డును నిర్మించేందుకు రెండేళ్ల కిందట రూ.2.50 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులు మంజూరయ్యాయి. పనులను దక్కించుకున్న గుత్తేదారు పనులను చేపట్టారు. రాగట్లపల్లి- దుమాల గ్రామాల మధ్య కల్వర్టును నిర్మించి చేతులు దులుపుకున్నారు. మట్టి కుప్పలు పోసి వదిలేశారు. యేడాదిగా పనులు ముందుకు సాగడం లేవు. మట్టి రహదారిపై నుంచే ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిపోయిన పనులు

మండలంలోని రాగట్లపల్లి- దుమాల- అక్కపల్లి మీదుగా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామాల వరకు రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ దుమాల- అక్కపల్లి- శివంగాలపల్లి గ్రామాల వరకు పూర్తి చేశారు. రాగట్లపల్లి- దుమాల రహదారి పనులను వదిలేశారు. వ్యవసాయ పొలాల మధ్య నుంచి రహదారి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. మట్టిని తీసుకువచ్చి కుప్పలుగా పోశారు. అక్కడక్కడ కల్వర్టులను నిర్మించారు. పనులను పూర్తి చేయకుండానే మధ్యలో వదిలేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. యేడాది దాటినా పనులను పూర్తి చేయకపోవడం వల్ల తరుచూ వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి రహదారి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

వీర జవాన్లకు ఘన నివాళులు



నాగారంలో నివాళులర్పిస్తున్న భజరంగ్‌దళ్ నాయకులు



మండపల్లిలో అమరులకు నివాళులర్పిస్తున్న యువత

కోనరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో వీర జవాన్లకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి దేశాన్ని కాపాడిన సైనికుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా కొమ్ము మధు, మేకల శ్రవణ్, బొట్టు విద్వసంత్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: అమరులైన భారత జవాన్లకు తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామ యువకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం రాత్రి గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశం కోసం వారు చేసిన సేవలు, వీరోచిత పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాగిపెల్లి కృష్ణారెడ్డి, నక్క రవి, చెన్నమనేని ప్రశాంత్, గోనపెల్లి శ్రీనివాస్ గౌడ్, అసాని మహిపాల్ రెడ్డి, యాస మధు, అమరగొండ రాజు, పెద్ది రఘు, దుర్మట్ల లచ్చిరెడ్డి, జగ్గాని జెలందర్, ధర్మరెడ్డి చందు, బండి భాస్కర్ గౌడ్, గడ్డం రాము, యాస రాజేష్, గంట పర్శరాములు, జగ్గాని శ్రీకాంత్, పాతూరి నరేష్, నక్క బాలకిషన్, చిన్నారులు గాధగోని నిహంత్, త్రినయ్, హర్షిత్, పెద్ది అకుల్, నిత్య విద్య చరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.